## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలో పదేళ్ళ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని భారతీయ జనతా పార్టీ అగ్ర నేత నరేంద్ర మోడీ తెలిపారు.
- రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు పేదల భవిష్యత్తును నిర్ణయిస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.
- సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సమగ్రమైన కార్యచరణతో ఎన్నికల మ్యానిఫెస్టో ని రూపొందించామని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- రాష్ట్రంలో పలు జిల్లాలలో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

========================

దేశంలో పదేళ్ళ పాలనలో ఎంతో అభివృద్ధిని సాధించామని భారతీయ జనతా పార్టీ అగ్ర నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని జహీరాబాద్ ఎన్నికల ప్రచారంలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలోని కీలక రంగాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని గుర్తు చేశారు. దేశ పురోగతికి అవసరం అయిన అనేక చర్యలను తీసుకున్నామని నరేంద్ర మోడీ తెలిపారు. దేశంలో పేదరికం తగ్గిందని ఆయన పేర్కొన్నారు.

========================

రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు పేదల భవిష్యత్తును నిర్ణయిస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఈ రోజు ఒంగోలు జిల్లా టంగుటూరు, ఉమ్మడి కడప జిల్లాలోని మైదుకూరు, అన్నమయ్య జిల్లా కలికిరిలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చామని తెలిపారు. గడచిన 58 నెలల పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, గ్రామ గ్రామన ఇంటి వద్దకే పౌరసేవలు, సంక్షేమ పథకాలను అందించామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సమగ్రమైన కార్యచరణతో ఎన్నికల మ్యానిఫెస్టో ని రూపొందించామని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీల ఉమ్మడి మ్యానిఫెస్టోని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్‌సింగ్‌లతో కలిసి ఈ రోజు విడుదల చేశారు. కాగా, ఈ మ్యానిఫెస్టో లో సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంపు, పేదలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి హామీలు ఉన్నాయి. అలాగే, మెగా డీఎస్సీపై మొదటి సంతకం, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున అందజేస్తామని ప్రకటించారు. యువతకు ఏటా 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి హామీలను ఇచ్చారు. తల్లికి వందనం' కింద చదువుకుంటున్న పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం వంటి హామీలు ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో తీవ్ర మైన వడగాలులు బలంగా వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ పేర్కొంది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, కాకినాడ, బాపట్ల, కోనసీమ, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉంటుందని వివరించింది. తీవ్ర వడగాడ్పుల నేపథ్యంలో వీలైనంత వరకు ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని, ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర విపత్తుల సంస్థ సూచించింది. కాగా రాష్ట్రంలో పలు జిల్లాలలో 46 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతి జిల్లా నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మే 21 నుండి 29వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం ధ్వజావరోహణం, రాత్రి - పెద్దశేష వాహనంతో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరి నారాయణన్ తెలిపారు. నెల్లూరులో ఈరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పోటీలో ఉన్న అభ్యర్థులకు అనుగుణంగా ఈ .వి ఎం. లను సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, అభ్యర్థులు పోలింగ్ కు 48 గంటల ముందు ప్రచారాన్ని ఆపేయాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు జిల్లాని వీడి వెళ్లాలని స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలుగు జాతి గౌరవాన్ని చాటి ఈ శతాబ్దం నాది అని సగర్వంగా ప్రకటించిన మహా కవి శ్రీశ్రీ జయంతి ఈ రోజు. ఆయన తనదైన శైలిలో రచించిన కవిత్వంతో పేదల పక్షం వహించారు. తన కవిత్వం ద్వారా బడుగులు అభాగ్యుల వేదనలు రోదనలు బహిర్గతం చేశారు. అన్యాయాల మీద ప్రశ్నించారు. 1910 లో విశాఖపట్నం లో జన్మించిన శ్రీ రంగం శ్రీనివాసరావు తదనంతర కాలంలో శ్రీ శ్రీ గా సుప్రసిద్ధులు అయ్యారు. 1930 ప్రాంతంలో ఆయన రచించిన మహా ప్రస్థానం నాటికీ నేటికీ కూడా అద్భుతమే. ఆ కవితా సంపుటిలో ఒక్కో కవితా వర్తమాన సమాజాన్ని నిలదీస్తూనే ఉంటుంది. సినీ రంగంలో కూడా శ్రీశ్రీ అనేక పాటలు రచించారు. చైతన్యవంతమైన గీతాలు ఎన్నో ఆయన కలం నుంచి జాలువారాయి. 1974 లో వచ్చిన అల్లూరి సీతారామరాజు సినిమాలో తెలుగు వీర లేవరా అనే పాటకు శ్రీశ్రీకి జాతీయ పురస్కారం లభించింది. 1983 లో ఆయన మరణించారు.

=========================

విశాఖ జిల్లాలో ఎన్నికల నిబంధనల అమలు లో భాగంగా 13.41 కోట్ల రూపాయలను జప్తు చేసినట్లుగా జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఏ.మల్లిఖార్జున తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లో ఈ రోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బందికి మే 5,6,7 తేదీల్లో, అత్యవసర సేవకులకు 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నాట్లుగా చెప్పారు. జిల్లాలో 1,523 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

=========================

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నరేందర్ సింగ్ బాలి కోరారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు పట్టణంలో ఈ రోజు ఓటు వినియోగం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, 85 సంవత్సరాల నిండిన వృద్ధులు ఇంటి నుండి ఓటు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు.

=========================

ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జోనల్ మేనేజర్ శాంతి ప్రభ వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈరోజు పార్వతీపురం మండలం బందలుప్పి పీహెచ్ సీలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్నటువంటి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

=========================

మచిలీపట్నం లోక్ సభ స్థానానికి పోలీస్ పరిశీలకులుగా ఉన్న ప్రసాద్ అక్కనోరును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ గురించిన పలు అంశాలను కలెక్టర్ ఆయనకు వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పోలింగ్ సిబ్బందికి ఇచ్చిన శిక్షణ పలు అంశాలపై చర్చించారు. సున్నితమైన అతి సున్నితమైన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సిఆర్పిఎఫ్ సాయుధ బలగాలతో పహారా వంటి అంశాలను వివరించారు.

=========================

కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి హజ్ యాత్రను విజయవంతం చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో మొదటి సన్నద్ధత సమావేశాన్ని విజయవాడలో ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హజ్ యాత్రకు ఈ ఏడాది కోటా కింద 2902 మందికి గాను ఇప్పటి వరకు 2580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 728 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 1118 మంది, బెంగుళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుండి 725 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుండి 9 మంది హజ్ యాత్రకు బయలుదేరనున్నారని వివరించారు.

=========================

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా పోలింగ్ కు 72 గంటల ముందు రాజకీయ ప్రచారాన్ని నిలుపుదల చేయాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో వివిధ నెట్వర్క్ సర్వీస్ ప్రొవైడర్స్ తో ఆయన ఈ రోజు సమావేశం నిర్వహించారు. మే 13వ తేదీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్న దృష్ట్యా, పోలింగ్ తేదీకి 72 గంటల ముందు అంటే మే నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి

వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు వారి రాజకీయ ప్రచార ప్రకటనలకు సంబంధించిన బల్క్ ఎస్ఎంఎస్ లు, వాయిస్ మెసేజ్ లను పంపకూడదని పేర్కొన్నారు.

==========================

==========================